సీరియల్

వి.యస్.రావ్

అన్వేషణ

(గత సంచిక తరువాయి)

అతనివైపు ఏదో అరవబోతూ మనోజ్ ఆగాడు. భరత్ ఆరితేరిన వ్యక్తిలా వున్నాడు. పైన చిన్నగా చప్పుడైంది. తాడు గోడవారగా పాములా కిందికి పాకుతోంది. గుడ్! భరత్ తాడుని ఉపయోగించి, కిందికి దిగబోతున్నాడు.

"భరత్! వచ్చేయ్!" మనోజ్ చిన్నగా అరిచాడు. కానీ అతని మాటని పిస్టల్ షాట్ మింగేసింది. మనోజ్ ఉలిక్కిపడి, కంగారుగా పైకి చూశాడు. భరత్ తూలి పడబోతూ, తాడు ఆధారంతో జరజరా కిందికి దూసుకొస్తోన్నాడు. మరుక్షణంలో తన దగ్గరగా కిందికి వాలిన భరత్ భుజమ్మీద మనోజ్ చెయ్యి వేశాడు.

"భరత్....గాయపడ్డావా?" వణికే కంఠంతో

ప్రశ్నించాడతను.

భరత్ రొప్పుని ఆపుకుంటూ తల విదిల్చాడు. తటాలున లేచి, నిలబడ్డాడు. "పక్క కాల్చి కరిచేసింది. ఆల్ రైట్ ....పద! తొందరగా ....!" బొంగురుగా అన్నాడతను.

* * *

మనోజ్ కదిలాడు. గోడ అవతల నుంచీ యెవరో మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు ఏ నిచ్చెననో ఉపయోగించి, ఇటువైపు దూకొచ్చు. గేటువైపు పరుగెత్తి, ఇటువైపు రావొచ్చు. తమకి ఆట్టే వ్యవధి లేదు. మనోజ్ రోడ్డువైపు పరుగెట్టసాగేడు. అప్పటికే విభీషణ్ ఎలుగుబంటిలా ముందు పరుగెడుతున్నాడు.

తన వెనుక వస్తున్న భరత్ వొగరుస్తూ చేస్తున్న శబ్దం మనోజ్‌కి వినిపిస్తోంది. గాయం తగిలిన భరత్ ప్రాణం కోసం పరుగెడుతున్నాడు!

రోడ్లోంచీ సందులోకి మలుపు తిరిగి మనోజ్ యెదురుగా చూశాడు. విభీషణ్ అప్పుడే పడిశేపు తిరుగుతున్నాడు! మనోజ్ చెవులు రిక్కించాడు. భరత్ చేస్తోన్న శబ్దాలు తప్ప, మరే చప్పుళ్ళూ వినపడ్డంలేదు. ఇంకా తమని వాళ్ళు వెంటాడ్డంలేదు....

మనోజ్ మరో మలుపు తిరిగాడు. పడుతూ లేస్తూ ముందు వెళ్తున్న విభీషణ్‌ని చూస్తూ నవ్వుకుంటూ గోడ వారగా ఆగాడు. వెనుకనుంచీ భరత్ అడుగుల చప్పుడు తప్ప మరేం వినపడ్డంలేదు. వాళ్ళెందుకు రాలేదు? సందులమ్మట రాకుండా తిన్నగా వెళ్ళిపోయారా? ఆలోచిస్తోన్న మనోజ్ ఉలిక్కిపడ్డాడు. దబ్ మంటూ చప్పుడైంది.

మనోజ్ ఆదుర్దాగా చూశాడు. రోడ్డువారగా, భరత్ బస్తాలా పడున్నాడు. మనోజ్ అతనివైపు పరుగెట్టాడు. భరత్ మూలుగు అతనికి తగ్గుస్వరంలో వినిపిస్తోంది. మనోజ్ అతని దగ్గరగా కిందికి వంగాడు.

"భరత్...."

భరత్ మూలిగాడు. "బుల్లెట్....వీపులో....దూరి నట్టుంది....ఓహ్....కారు....కారు తెచ్చావా?" తగ్గు స్వరంలో ఆగి భరత్ దగ్గడం ప్రారంభించాడు.

మనోజ్ అతని భుజమ్మీద చెయ్యి వేశాడు. దగ్గు ఆపేసిన భరత్ నిశ్శబ్దంగా పడున్నాడు మనోజ్ అతని దగ్గరగా, నేలమీద గొంతుకూర్చున్నాడు. అతని ముంజేతిని పట్టుకుని నాడిని పరీక్షించే ప్రయత్నం చేశాడు. అతని వేళ్ళకి చల్లగా గట్టిగా ఏదో తగుల్తోంది. ఏదో కడియం. దాన్ని పక్కకి తోస్తూ వేళ్ళని అతని నాడిమీద వుంచాడు. నాడి బలహీనంగా కొట్టుకుం టోంది.

"భరత్...." మొహం దగ్గరగా వంగి, మనోజ్ పిలిచాడు.

"....నేను....నేను....భరత్ కాదు....బాబ్జీని.... ఆస్పత్రి....డాక్టర్...." పలవరిస్తున్నట్టుగా గొణిగా డతను.

భరత్ కాదు! బాబ్జీ!....మనోజ్ ఆశ్చర్యంతో ఉలిక్కిపడ్డాడు. విరూపాక్షరావు ఇతని పేరుని మార్చి ఎందుకు చెప్పాడు? అతని అనుచరులు రెండుమూడు పేర్లతో జీవిస్తున్నారా? ఎందుకు?

ఆలోచిస్తూ మనోజ్ మళ్ళీ అతని నాడిని పరీక్షించ డానికి వేళ్ళు చాచాడు. మళ్ళీ చల్లగా ఏదో, అతని

చేతికి తగిలింది. మనోజ్ చేతిని తటాలున వెనక్కి లాక్కున్నాడు. అతని మెదడులో ఏవో తారాజువ్వల్లా మాసు కళ్తున్నాయి.

మనోజ్ మళ్ళీ అతని మణికట్టుని పట్టుకున్నాడు. అతన్ని కుదుపుతూ కంగారుగా పిలిచాడు. "భరత్ .... బాబ్జీ ...."

జవాబుగా బాబ్జీ మూలిగాడు.

"బాబ్జీ ...నిజం చెప్తే నిన్ను డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తా . లాయర్ రంగనాథం భార్యను గాయపరిచింది నువ్వేనా?" మనోజ్ అతని చెవిదగ్గరగా అన్నాడు.

బాబ్జీ కంఠం గుర్రు గుర్రుమంటూ చప్పుడు చేసింది. అతను శరీరం సగానికి తెగిన పాములా కదులుతున్నాడు. మనోజ్ అతని చేతిని నొక్కుతూ మళ్ళీ అడిగాడు.

"ఊ ... నే.... నే...." బాబ్జి మూలిగాడు.

మనోజ్ వేళ్ళు అప్రయత్నంగా అతని మణికట్టు చుట్టూ బిగుసుకున్నాయి. అతని శరీరం వణుకుతోంది.

"ఎందుకు?" మనోజ్ అసంకల్పితంగా గర్జించాడు.

బాబ్జీ మాట్లాడలేదు. బాధతో మూలుగుతూ వుండిపోయాడు.

మనోజ్ ఎడమచెయ్యి బాబ్జీ చొక్కా ముందుభాగాన్ని గట్టిగా బిగించి పట్టుకుంది. అతన్ని కొంచెం పైకిలేపుతూ మళ్ళీ అడిగాడు మనోజ్ :"ఎందుకు? చెప్పు!"

"బాస్ .... బాస్ .... చెప్పాడు........" బాబ్జీ గుసగుసగా అన్నాడు.

"బాస్ ఎవరు?" మనోజ్ మళ్ళీ అడిగాడు. బాబ్జీ కంఠంలో గురక ప్రారంభమైంది. మనోజ్ ప్రశ్న వినిపించని ఏదో ప్రదేశంలో వున్నాడతను. మనోజ్ అదే

ప్రశ్నని పదేపదే అడుగుతూ వుండిపోయాడు. చెవిలో ధ్వని తగ్గుతున్న మనోజ్ కంఠం బాబ్జీని ఈ లోకంలోకి లాక్కొచ్చింది. అర్థరహితంగా యేమిటో గొణుగు తున్నాడు దతను.

"బాబ్జీ.... చెప్పు! బాస్ ఎవరు?" మళ్ళీ అరిచాడు. చెవిని బాబ్జీ నోటికి దగ్గరగా వుంచాడు.

"వి....రూ....పా....క్ష....రా...." బాబ్జీ యమ ప్రయత్నంతో ఒక్కొక్క అక్షరాన్నే పలుకుతూ ఆగాడు. మనోజ్ చెవికీ, చెంపకూ వెచ్చటి జల్లు తగిలింది బాబ్జీ కక్కుతున్న రక్తం!

మనోజ్ చెయ్యి అతని చొక్కాని వదిలేసింది. బాబ్జీ తల నేలమీదికి వాలింది. మనోజ్ ఎడమచేతిని అతని ఛాతీమీదికి జరిపాడు. అతని గుండె విశ్రాంతి తీసు కుంటోంది...

తన కుడిచేతి వేళ్ళకి చల్లగా తగులుతున్న గొలుసుని బలంగా ఇవతలికి లాగాడు మనోజ్. రోడ్డుమీద పడున్న తన రివాల్వర్ని అందుకొన్నాడు.

బాబ్జీ తను యిచ్చిన రివాల్వర్ కోసం వెతికాడు. అతని చేతుల్లో, శరీరంమీదా రివాల్వర్ లేదు. అతను యెక్కడో జారవిడిచి వుంటాడు. మనోజ్ మెల్లిగా లేచాడు.

తన వేళ్ళమధ్య ఇరుక్కున్న గొలుసుని కసిగా నొక్కుతూ జేబులో పడేసుకున్నాడు.

దూరంగా యేదో కారు స్టార్టయిన శబ్దం వినిపిస్తోంది. మనోజ్ బాబ్జీ శవాన్ని అలాగే వదిలేసి, వేగంగా పరు గెత్తసాగేడు. రెండు మలుపులు తిరిగి మెయిన్‌రోడ్డు అంచుకి చేరుకున్నాడు. జాగ్రత్తగా రెండడుగులు

ముందుకి వేసి, తను కారు ఆపిన చెట్టువేపు తలవాల్చి చూశాడు.

కారు లేదు!

• • •

మాయమైన కారు గురించి ఆశ్చర్యంతో ఆలో చిస్తోన్న మనోజ్‌ని అడుగుల చప్పుళ్ళు దూరం నుంచీ హెచ్చరించాయి.

అతను ఎడంవేపున్న సందులోకి పరుగుతీశాడు. దగ్గర దగ్గరగా వున్న ఇళ్ళమధ్య అడ్డంగా, నిలువుగా సాగి పోతున్న సందులమ్మట వేగంగా పరుగెడుతూ వుండి పోయాడు.

నిమిషాలు దొర్లుతున్నాయి. మలుపులు తిరుగుతూ మనోజ్ తనకీ, తనని వెంటాడేవాళ్లకీ మధ్య దూరాన్ని పెంచుతున్నాడు. కాలువలు కట్టుతున్న చెమట అతని శరీరాన్ని స్నానం చేయిస్తోంది. మెయిన్ రోడ్ లోకి వెళ్ళకుండా అతను జాగ్రత్తపడుతున్నాడు.

వాళ్ళు యెంత వేగంగా పరుగెట్టినా తనని అందుకో లేరని అతనికి తెలుసు. త్వరలో పరుగుకు స్వస్తి చెప్పి వాళ్ళు కారెక్కుతారు. వెడల్పాటి రోడ్డులోకి ప్రవే శించనంతకాలం కారులో కూడా వాళ్ళు తనని అందుకో లేరు...

మలుపు తిరిగి మనోజ్ ఆగాడు.

ఊపిరి వేడిగా అతని ముక్కుల్లోంచీ బైటపడు తోంది. అరచేత్తో మొహాన్ని తుడుచుకుని మనోజ్ రిస్టు వాచీ చూశాడు. దాదాపు ముప్పావుగంట తను ఆప కుండా పరుగెట్టాడు! ఆ ప్రదేశం నుంచీ తను చాలా దూరం వచ్చేశాడన్నమాట.

మనోజ్ చెవులు రిక్కించాడు. అవాంఛితమైన శబ్దా లేవీ వినిపించడంలేదు.

సందులోంచీ మెయిన్ రోడ్డులోకి కదిలాడు. పరిశీల నగా చూశాడు. చిరునవ్వుతో అతని పెదవులు విచ్చు కున్నాయి. రంగులరాట్నంలా తిరిగినా తను ఆ ప్రదేశం నుండీ దూరంగా వచ్చేశాడు. తను టూ టౌన్ లో వున్నాడు. మామూలుగా నడిస్తే తన హోటల్ గది చేరుకోడానికి పావుగంటకన్నా పట్టదు. రోడ్డు దాటి మరో సందులోకి ప్రవేశించాడతను.

వేగంగా అడుగులేస్తున్న మనోజ్ తటాలున ఆగాడు. తను తీసుకువచ్చిన కారు మాయమైంది. విరూ పాక్షరావు నిజస్వరూపం భరత్—బాబి ద్వారా తనకి తెలిసింది. తనకి తెలిసినట్టు కారు తీసుకుని ఉడాయించిన వ్యక్తికి తెలుసా? విరూపాక్షరావుకి తెలుసా?

ప్రాణాలు పిడికిట్లో పట్టుకుని పరుగెడుతున్న ఆ వ్యక్తి ఆగి, తన అనుచరుడు ప్రాణాలు వదుల్తూ చెప్పిన మాటల్ని విన్నాడా? ఆలోచిస్తూంటే అది అసంభవ మనిపిస్తోంది మనోజ్ కి. అయినా యేదో అనుమానం అతన్ని ముల్లులా గుచ్చుతోంది. మనోజ్ నడక ప్రారం భించాడు. ఏమీ తెలీనట్టు నటించడం తనకి మంచిది.

విరూపాక్షరావు అసలు రూపం తెలిసినట్టు తను ప్రవర్తిస్తే. అది తనకి ఆటంకం అవుతుంది. విరూపాక్ష రావు చుట్టూ కోట కట్టుకుని, అనుక్షణం తనని హత మార్చడానికి ప్రయత్నిస్తాడు! తను నటించే అమాయ కత్వం తనకి కవచంలా ఉపయోగిస్తుంది. నివురు కప్పిన నిప్పులా అది తనని దాచి వుంచుతుంది!

విరూపాక్షరావ్! మనోజ్ అప్రయత్నంగా పళ్ళు

కొరుక్కున్నాడు. రాక్షసుడు! తెలివిగా తనని వుపయోగించుకున్నాడు. మేకతోలుని అడ్డంగా పెట్టుకొని తన పులిరూపాన్ని మరుగుపరిచాడు. అనుచరుల్ని రక్షించుడానికి తనని ఆయుధంగా వాడుకున్నాడు!

మనోజ్ పిడికిళ్ళు ఆవేశంగా బిగుసుకున్నాయి.

* * *

ఉదయం తొమ్మిది కావస్తోంది.

మనోజ్ గదిలో పచార్లు చేస్తున్నాడు. ఆలోచనలతో అతని బుర్ర వేడెక్కుతోంది. ఇంతకాలం తను విరూప్ ఇంటర్నేషనల్ ఫిల్డాఫీసర్ గా ఈ హోటల్ గదిలో వున్నాడు. విరూపాక్షరావు యేర్పాటు చేసిన విడిదిలో యింకా వుండటానికి యెందుకో మనస్కరించడంలేదు. హోటల్ పూర్తిగా అతని చేతిలో ఉన్నట్టుంది....

మనోజ్ సిగరెట్ వెలిగించాడు. తను మరోచోటికి మారిపోతే విరూపాక్షరావు అప్రమత్తుడవుతాడు. తనకి అంతా తెలుసని తెలుసుకుంటాడు. అది తనకి ప్రమాదం. వేటాడాల్సిన తను వేటాడబడకుండా కాపాడుకోవడంతోనే సరిపోతుంది! మనోజ్ లో యేదో ఆలోచన మెరిసింది.

సోఫాలో కూచుని టెలిఫోన్ రిసీవరెత్తాడు. హోటల్ మేనేజర్ కి కనెక్షన్ ఇమ్మన్నాడు. కనెక్షన్ రాగానే మేనేజర్ని గదికి రమ్మన్నాడు. అసహనంగా లేచి పచార్లు ప్రారంభించాడు. నిమిషాలు గడుస్తున్నాయి....

తలుపుమీద వేళ్ళ కణుపులు చప్పుడు చేశాయి. మనోజ్ గబగబా వెళ్ళి తలుపుని కొద్దిగా తెరిచి గుమ్మం ముందు నిలబడ్డ హోటల్ మేనేజర్ని చిరునవ్వుతో

చూశాడు.

తలుపుని బార్లా తెరిచి, అతను లోపలికి రాగానే మూసి గొళ్ళెం పెట్టేశాడు.

హోటల్ మేనేజర్ మౌనంగా, ప్రశ్నార్థకంగా చూస్తున్నాడు.

సోఫాలో కూచుని మేనేజర్ని నవ్వుతూ చూశాడు.

"కూర్చోండి!"

హోటల్ మేనేజర్ రిమ్‌లెస్ అద్దాలగుండా విసుగ్గా చూశాడు "నాకు పనుంది. ఏమిటో చెప్పండి!"

మనోజ్ మొహంమీద చిరునవ్వు మాయమైంది. "మిస్టర్ గుర్నాథం నాకో బుల్ డాగ్ కావాలి!"

గుర్నాథం అర్థంకానట్టు చూశాడు. అతని కనుబొమలు మధ్యలో కల్సుకున్నాయి.

"మాది హోటల్ వ్యాపారం; కుక్కల వ్యాపారం కాదు!" అతని కంఠంలో చిరాకు స్పష్టంగా ధ్వనించింది.

మనోజ్ ఆశ్చర్యంగా చూశాడు. మేనేజర్ అమాయకుడా? నటిస్తున్నాడా? తనని కన్సుకోవాల్సి వస్తే మేనేజర్ని "బుల్ డాగ్ కావాలి!" అని అడగమన్నాడు విరూపాక్షరావు....

"మిస్టర్ గుర్నాథం, విరూపాక్షరావుగారు...." మనోజ్ ఏదో చెప్పబోయాడు.

"ఎవరతను?" గుర్నాథం అడ్డొస్తూ విసుగ్గా అడిగాడు.

మనోజ్ సోఫాలో వెనక్కి వాలాడు. కళ్ళు చిట్లిస్తూ గుర్నాథాన్ని చూశాడు. గుర్నాథం అసహనంగా కదుల్తున్నాడు.

"విరూపాక్షరావు వెవరో మాకు తెలీదు. కనీసం నేను తెలుసా? మనోరంజన్, ఫీల్డాఫీసర్, విరూప్ ఇంటర్నేషనల్స్...."

మేనేజర్ విడ్డూరంగా చూశాడు. కళ్ళద్దాల్ని తీసి చేత్తో పట్టుకున్నాడు. "మిస్టర్ మనోజ్, మీ ఆరోగ్యం బాగున్నట్టు లేదు! మీ పేరు మార్చి యెందుకు చెప్తున్నారో నాకు అర్థంకావడంలేదు. మీరు చెప్తున్న కొత్త పేరూ, హోదా ఇవేమీ నాకు తెలీదు! యూ బెటర్ సీ ఎ సైకియాట్రిస్టు! కావాలంటే...."

మనోజ్ తటాలున లేచి నిలబడ్డాడు. గుర్నాథం కళ్ళలోకి శూలాలతో పొడుస్తున్నట్టు చూశాడు. "మనోరంజన్ పేరుతో నేను ఇక్కడ దిగాను. నా కారు మీ గారేజీలో వుంది...."

గుర్నాథం బరువుగా నిట్టూర్చాడు. "మిస్టర్ మనోజ్, అయామ్ సారీ ఫర్ యూ! సూట్ కేస్ మోసుకుని, కాలినడకన మీరు మా హోటల్ కి వచ్చారు.... ఆల్ రైట్....మీరున్న స్థితిలో నేను మీతో మాట్లాడి లాభంలేదు. సైకియాట్రిస్టు సంజీవరావుని ఇక్కడికి పిలిపిస్తాను...."

"నో థాంక్స్!" మనోజ్ అడ్డొస్తూ అరిచాడు. "మిస్టర్ గుర్నాథం, సారీ. మీకు కష్టం కలిగించాను. ఏదో అర్జెంటు పనుందన్నారు. వెళ్ళండి! ఇంకా నేను మీతో మాట్లాడితే, సైకియాట్రిస్టు దగ్గరకు కాదు; పిచ్చాసుపత్రికి వెళ్ళాల్సి వుంటుంది!"

గుర్నాథం మొట్టమొదటిసారిగా చిరునవ్వు నవ్వాడు. కళ్ళద్దాల్ని తగిలించుకుంటూ మెల్లగా వెనక్కి తిరిగాడు. గున్న ఏనుగులా నడుస్తూ వెళ్ళిపోయాడు.

మనోజ్ సోఫాముందు స్తంభంలా నిలబడిపోయాడు. విరూపాక్షరావు తను ఊహించినదానికన్నా స్పీడుగా వ్యవహరిస్తున్నాడు. ఈ హోటల్లో తన ఉనికి అవసరం లేదని తనకి పరోక్షంగా తెలియజేయబడింది! అంటే, విరూపాక్షరావు బైటపడిపోయాడు. ఎందుకు? తనని దూరంగా తోసేస్తున్నాడు. ఎందుకు? సగం కాలిన సిగరెట్ని దూరంగా విసిరి మనోజ్ పచార్లు ప్రారంభిం భించాడు.

రెండు అరచేతుల్లో కణతల్ని నొక్కుకున్నాడు మనోజ్. తను ఈ గదిలో వుండాలా? మరోచోటికి బిచాణా ఎత్తేయాలా?

అతని ప్రశ్నకి సమాధానం చెప్తున్నట్టు టెలిఫోన్ మ్రోగింది. రిసీవర్ని లాగి చెవికి ఆనించాడు మనోజ్.

"యస్?"

"రిసెప్షన్....మిస్టర్ మనోజ్, నెల దాటినా మీరు అకౌంట్ ఫైనలైజ్ చేయలేదు...."

"వాట్!" మనోజ్ ఆశ్చర్యంగా అరిచాడు.

"బిల్లు తొమ్మిదివేలు దాటింది...." రిసెప్షనిస్టు కంఠం ఆక్షేపణగా ధ్వనించింది.

"వాట్!"

"వెంటనే పేమెంట్ అరేంజ్ చేయండి. ఆడిట్ ఇబ్బంది లున్నాయి...."

మనోజ్ కింది పెదవిని పంటితో నొక్కుకుంటూ కాసేపు మౌనంగా వుండిపోయాడు. విరూపాక్షరావు ఖచ్చితంగా దగాకోరే! స్కౌండ్రల్! తన మీద పాన పెట్టడానికి చాలా శక్తులు సిద్ధంగా వుంచుకున్నట్టున్నాడు....

(ఇంకా వుంది)